నేడు చిలకలగూడలో ఉచిత వైద్య శిబిరం

అడ్డగుట్ట, జూన్ 7: జనహిత సేవా ట్రస్ట్, కిమ్స్ ఫౌండేషన్ల సంయుక్త ఆధ్వర్యంలో చిలకల గూడ దూద్‌బావిలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఆదివారం (నేడు) ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు క్యాంపు కోఆర్డినేటర్ బి.నర్సింగరావు శనివారం ఒక ప్రకటనలో తెలియజేశా రు. ప్రజలు ఈ అవకాశాన్ని తప్పనిసరిగా సద్వినియోగం చేసుకోవాలని, వైద్య శిబిరం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 వరకు కొనసాగుతుందని ఆయన తెలిపారు. ఈ వైద్య శిబిరంలో ప్రముఖ వైద్యులు పాల్గొంటారని ఆయన అన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

బేగంపేట్, జూన్ 7: ఆర్థిక ఇబ్బందులతోపాటు మద్యానికి బానిసై ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన బేగంపేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బేగంపేట్ రసూల్‌పురకు చెందిన శ్రీకాంత్(28) కారు డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఇతనికి భార్య ఒక కూతురు ఉన్నారు. రెండు రోజుల క్రితం శ్రీకాంత్ పీకలదాకా మద్యం సేవించి భార్యతో ఘర్షణ పడ్డాడు. దీంతో భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. అదేరోజు సాయం త్రం భార్యకు ఫోన్ చేసి మద్యం సేవించేందుకు డబ్బులు కావాలని అడిగాడు. అందుకు ఆమె నిరాకరించింది. ఇంట్లోనే మద్యం మత్తులో ఉన్న శ్రీకాంత్ మనస్తాపంతో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. మరుసటి రోజు శ్రీకాంత్ బయటకు రాకపోడవంతో అనుమానం వచ్చిన కుటుంబ సభ్యులు కిటికిలో నుంచి చూడగగ ఉరేసుకొని కనిపించాడు. దీంతో కు టుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యా దు చేశారు. పోలీసుల విచారణలో ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య చేసుకున్నట్టు పోలీసులు తెలిపారు.

త్యాగానికి ప్రతీక బక్రీద్

● ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్



భోలక్‌పూర్ బడీ మసీదు వద్ద ముస్లింలకు బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

తెలంగాణ కళాభారతి స్టేడియంలో నిర్వహించిన ప్రార్థనలకు హాజరైన ముస్లింలు

కవాడిగూడ, జూన్ 7: బక్రీద్ పండుగ త్యాగానికి ప్రతీక అని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. బక్రీద్‌ను పురస్కరించుకొని భోలక్‌పూర్‌లోని చారిత్రక బడీ మసీద్ వద్ద శనివారం ఎమ్మెల్యే ముఠా గోపాల్, ముతావలీ నజీర్ అలీతో పాటు ముస్లింలకు బక్రీద్ శుభాకాంక్షలను తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముషీరాబాద్ నియోజకవర్గంలో పండుగలను హిందూ ముస్లింలు ఐక్యంగా జరుపుకుంటూ సామరస్యాన్ని కాపాడటం గొప్పవిషయమన్నారు. ఈ కార్యక్రమంలో డిజిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు వై.శ్రీనివాస రావు, నాయకులు రహీం, చాంద్‌పాషా, జబ్బార్, మక్బూల్, ఆరిఫ్ తదితరులు పాల్గొన్నారు. బడీమసీదు వద్ద చిక్కడపల్లి ఏసీపీ రమేష్‌కుమార్ పర్యవేక్షణలో ముషీరాబాద్ సీఐ రాంబాబు ఆధ్వర్యంలో ఎస్ఐ లక్ష్మీనారాయణ, సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

తెలంగాణ కళాభారతి స్టేడియంలో

తెలంగాణ ప్రభుత్వ క్వాజిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బక్రీద్ పండుగను పురస్కరించుకొని నగరం నడిబొడ్డున ఉన్న స్టేడియంలో ప్రార్థనలు నిర్వహించారు. జంటనగరాల్లోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున తరలివచ్చిన ముస్లింలు ఉదయం 7 గంటల నుంచి 9 వరకు ప్రార్థనలు జరిపారు. ప్రార్థనల సందర్భంగా మహిళలు, పురుషులు వేర్వేరుగా ప్రార్థనలు చేసేందుకు ఏర్పాట్లు చేశారు. ప్రార్థనల్లో భాగంగా దోమలగూడ పోలీసులు స్టేడియంలో బందోబస్తును ఏర్పాటు చేశారు.

బొల్లారంలో ఘనంగా..

బొల్లారం: త్యాగానికి ప్రతీక అయిన బక్రీద్ పర్వదిన వేడుకలు శనివారం కంటోన్మెంట్ వ్యాప్తంగా ఘనంగా జరిగాయి. ముస్లిం సోదరులు అత్యంత భక్తి శ్రద్ధలతో వేడుకలను నిర్వహించారు. ఈ పండుగ సందర్భంగా పలు మసీదులు, ఈద్గాల వద్ద ముస్లింలు తెల్లవారుజాము నుంచే ప్రార్థనలు చేశారు. అనంతరం ఒకరికొకరు ఆలింగనం చేసుకొని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ కార్యక్రమంలో మత గురువు ఆసిఫ్ రజా, ప్రధాన కార్యదర్శి మహమ్మద్ ఇక్బాల్, జావేద్, మున్ను, అజ్జు, బాబా, అన్వార్ తదితరులు పాల్గొన్నారు.

రసూల్‌పురాలో బక్రీద్ వేడుకల్లో పాల్గొని ప్రార్థనలు నిర్వహించిన మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శ్రీనివాస్

ప్రభుత్వ విద్యా సంస్థల అభివృద్ధికి కృషి

సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావుగౌడ్

పద్మారావు నివాసంలో మర్యాదపూర్వకంగా కలుసుకున్న నూతన డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ భారతి తదితరులు

సికింద్రాబాద్, జూన్ 7: సీతాఫల్‌మండి ప్రభుత్వ డిగ్రీ కాలేజీని ఉత్తమ విద్యా సంస్థగా తీర్చిదిద్దేలా తన వంతు కృషి చేస్తామని సికింద్రాబాద్ ఎమ్మెల్యే తీగుల్ల పద్మారావుగౌడ్ అన్నారు. ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్‌గా నూతనంగా నియమితురాలైన డాక్టర్ జి.బంగ్ల భారతి శనివారం ఎమ్మెల్యే పద్మారావుగౌడ్‌తో సికింద్రాబాద్ టకారబస్తీలోని ఆయన నివాసంలో సమావేశమయ్యారు. కొత్త భవనాల నిర్మాణం, ఇతరత్రా అంశాల్లో సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా పద్మారావుగౌడ్ మాట్లాడుతూ 2015లో తమ కృషి కారణంగా సీతాఫల్‌మండి స్కూల్‌లో జూనియర్, డిగ్రీ కాలేజీలు ఏర్పాటు అయ్యాయని తెలిపారు. కొత్త భవనాల నిర్మాణానికి రూ.29.75 కోట్ల మేరకు నిధులను గతంలో మంజూరు చేయించామని తెలిపారు. డిగ్రీ కాలేజీని అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ భారతితో పాటు అధ్యాపకులు పాల్గొన్నారు.

పార్కు అభివృద్ధి చేయాలని వినతి

వీఎస్టీ పార్క్ ను అభివృద్ధి చేయాలని ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న మాత వాకర్స్ అసోసియేషన్ సభ్యులు

చిక్కడపల్లి, జూన్ 7: మాత వాకర్స్ క్లబ్–నల్లకుంట ఆధ్వర్యంలో బాగ్‌లింగంపల్లిలోని వీఎస్టీ పార్కును అభివృద్ధి చేయాలని ఎమ్మెల్యే ముఠా గోపాల్‌కు శనివారం వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజవర్గం అనేక పార్కులను అభివృద్ధి చేయడం జరిగిందని తెలిపారు. వీఎస్టీ పార్కు అభివృద్ధికి అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. మాత వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు బొమ్మిడి శ్రవణ్‌కుమార్, డాక్టర్ వై.మురళీగరుడు, వి.నాగభూషణం, వెంకట్, మారం సురేష్‌గుప్తా, జీవనాధిత్య, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ హయాంలో.. విద్యారంగం నిర్వీర్యం

చిక్కడపల్లి, జూన్ 7: దేశంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నుండి విద్యారంగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేస్తున్నారని జాతీయ అధ్యక్ష కార్యదర్శులు వీపీ సాను, బిస్వాస్ అన్నారు. ఎస్ఎఫ్ఐ జాతీయ కమిటీ సమావేశాలు సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరుగుతున్నాయి. ఈ సందర్భంగా శనివారం విలేకరుల సమావేశం ఏర్పాటు 27వ తేదీన నాలుగు రోజుల పాటు జరిగే ఎస్ఎఫ్ఐ 18వ అఖిలభారత మహాసభల పోస్టర్లు ఆవిష్కరించారు. జాతీయ అధ్యక్ష కార్యదర్శులు వీపీ సాను మయుక్ బిస్వాస్ మాట్లాడుతూ నూతన విద్యా విధానం పేరుతో నరేంద్ర మోడీ విద్యార్థులపై ఫీజుల దాడి చేస్తున్నారని అన్నారు. బీజేపీ మతోన్మాదాన్ని పెంచిపోషిస్తుందని అన్నారు. అదేవిధంగా నూతన విద్యా విధానం పేరుతో దేశంలో విద్యను ప్రైవేటీకరణ చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అందరికీ విద్య, అందరికీ ఉపాధి అవకాశాలు కల్పించాలని, అదేవిధంగా చదువుకున్న వారికి ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జాతీయ ఉపాధ్యక్షురాలు డిప్సీత దార్, నితీష్ నారాయణ, దినిత్ డేంట, అశోక్, జాతీయ సహాయ కార్యదర్శి, తెలంగాణ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు ఎస్.రజనీకాంత్, టి.నాగరాజ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు అశోక్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారం కోసమే..

మణికొండ, జూన్ 7: ప్రజా సమస్యల పరిష్కారం కోసం 'ది సిటిజన్ కౌన్సిల్' నిరంతరం పాటుపడుతుందని మణికొండ మున్సిపాలిటీ ది సిటిజన్ కౌన్సిల్ ప్రధాన కార్యదర్శి ఉపేంద్రనాథ్‌రెడ్డి అన్నారు. శనివారం డాలర్‌హిల్స్ కాలనీలోని కార్యాలయంలో విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ సమస్యలను గుర్తించి ఎప్పటికప్పుడు పరిష్కరించే దిశగా కృషి చేస్తున్నామన్నారు. కొంతమంది తమ కౌన్సిల్ పేరును తప్పుగా సూచించే కుట్ర చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ప్రజల్లో ది సిటిజన్ కౌన్సిల్‌కు పెరుగుతున్న ఆదరణను జీర్ణించుకోలేక కొంతమంది వ్యక్తులు తప్పు భావనను తీసుకొచ్చేలా వ్యవహరిస్తున్నట్లు తెలిసింది. కొన్ని సమాచార మాధ్యమాల్లో పైవేటు వ్యక్తులకు సంబంధించిన వ్యక్తిగత వ్యవహారాలలో తమ కౌన్సిల్ సభ్యులు జోక్యం చేసుకున్నట్లు ఆరోపణలు వస్తున్నాయని అందులో ఎలాంటి వాస్తవం లేదన్నారు. ప్రజలకు మంచి చేయాలని ఉద్దేశంతో సేవ, సంకల్పాన్ని పెట్టుకొని ది సిటిజన్ కౌన్సిల్ ఏర్పాటు చేశామన్నారు. ప్రజలకు ఇబ్బందులు ఉంటే ది సిటిజన్ కౌన్సిల్ దృష్టికి తీసుకొస్తే కచ్చితంగా వారికి న్యాయం జరిగేలా తనవంతుగా చేయూత సహకారం అందిస్తామని తెలిపారు. ప్రతినిధులు అందె లక్ష్మణ్‌రావు పాల్గొన్నారు.

పోలీస్ వ్యవస్థ తీరు అభినందనీయం

సమావేశంలో మాట్లాడుతున్న తెలంగాణ పోలీస్ కంప్లైంట్ అథారిటీ మెంబర్ డాక్టర్ వర్రె వెంకటేశ్వర్లుయాదవ్

చిక్కడపల్లి, జూన్ 7: తెలంగాణ పోలీస్ వ్యవస్థ తీరు అభినందనీయమని తెలంగాణ పోలీస్ కంప్లైంట్ అథారిటీ మెంబర్ డాక్టర్ వర్రె వెంకటేశ్వర్లుయాదవ్ అన్నారు. యాదవ విద్యావంతుల వేదిక అధ్యక్షుడు చెలకాని వెంకట్‌యాదవ్ అధ్యక్షతన శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో వెంకటేశ్వర్లు సన్మానసభను నిర్వహించారు. తెలంగాణ పోలీస్ కంప్లైంట్ అథారిటీ మెంబర్‌గా విధులు సమగ్రంగా నిర్వహిస్తానని అన్నారు. పోలీసులు అత్యుత్తమంగా పనిచేస్తూ పేరు ప్రఖ్యాతలు రాష్ట్రానికి తీసుకొస్తుంటే.. మరోవైపు కొందరు పోలీసు అధికారులు అవినీతికి పాల్పడి ఏసీబీ అధికారులకు చిక్కడం బాధాకరమని అన్నారు. రాబోయే రోజుల్లో శాంతి భద్రతల విషయంలో తెలంగాణ పోలీసులు మరింత సమర్ధవంతంగా పనిచేసి పేరు తీసుకురావాలని అన్నారు. పాలమూరు యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ శ్రీనివాసరావు, నాయకులు లక్ష్మణ్‌యాదవ్, జానయ్య చక్రధరయాదవ్, శ్రీనివాస్‌యాదవ్, అచ్యుత తదితరులు పాల్గొన్నారు.

మాదిగల్లో పరిపూర్ణమైన మార్పు తీసుకొస్తాం

సమావేశంలో మాట్లాడుతున్న సమాజం నాయకుడు

కవాడిగూడ, జూన్ 7: మాదిగ సమాజంలో పరిపూర్ణమైన మార్పు తీసుకురావడమే ఆది పురుష ధర్మసమాజ ఆశయమని సమాజ ప్రచార ప్రధాన ధర్మకర్త ప్రొఫెసర్ ఏకు తిరుపతి అన్నారు. ఆది పురుష ధర్మ సమాజం ముఖ్య కార్యకర్తల సమావేశం లోయర్ ట్యాంక్‌బండ్‌లోని అంబేదర్కర్ భవన్‌లో శనివారం జరిగింది. సమావేశంలో ప్రొఫెసర్ ఏకు తిరుపతి, సఫాయి కార్మిక సంఘం మాజీ చైర్మన్ చింతా సాంబమూర్తి, బీఎల్ఎఫ్ పార్టీ వ్యవస్థాపకుడు నల్లా సూర్యప్రకాష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ ఏకు తిరుపతి మాట్లాడుతూ ఆది పురుష ధర్మ సమాజం మాదిగ, మాదిగ ఉపకులాల సమగ్ర జ్ఞాన సముదాయాన్ని ఆధ్యాత్మిక మార్గంలో నడిపిస్తుందన్నారు. ఆది పురాణాలను సామాజిక చరిత్రను అధ్యయనం చేస్తూ సమాజంలో అత్యుత్తమమైన సమూహంగా మాదిగల ఎదుగుదలకు మానసిక ధైర్యాన్ని వికాసాన్ని పెంపొందిస్తుందన్నారు. సృష్టిలో ఆది పురుషుడైన జాంబవంతునితో ముడిపడి ఉన్న సందర్భాలను గుర్తుచేస్తూ ప్రకృతిలోని మొదటి ధర్మకర్తలు మాదిగలు అని చాటి చెప్పాల్సిన బాధ్యత మాదిగ మేధావులపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పలు సంఘాల నాయకులు ముత్యాలరావు, ప్రొఫెసర్ సుభద్ర, సుదర్శన్ బాబు, ఇటుకరాజు, జున్ను కనకరాజు, ప్రొఫెసర్ శోభారాణి, రాజలింగం, సంగీత, నరసింహ, కుమార స్వామి, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

మంత్రివర్గ సమావేశాల్లో పెన్షనర్ల ఊసేలేదు

ఖైరతాబాద్, జూన్ 7: మంత్రివర్గ సమావేశాల్లో పెన్షనర్ల ఊసెఎత్తడం లేదని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాజేంద్రబాబు, నర్సింగరావు, ఆర్థిక కార్యదర్శి నర్సయ్య శనివారం తెలిపారు. ప్రభుత్వం మొక్కుబడిగా డీఏను ప్రకటించడం సరికాదని, ఇటీవల ఉప ముఖ్యమంత్రి విడుదల చేసిన ప్రకటనలో కూడా పీఆర్‌సీ గురించి ఎలాంటి ప్రస్తావన లేకపోవడం బాధాకరమన్నారు. ప్రభుత్వం ప్రకటించిన హెల్త్ కేర్ విధానంలోనూ స్పష్టత లేదని, అందరికీ నెలకు రూ.500 వసూలు చేయడం కంటె పెన్షనర్ల పెన్షన్ ఆధారంగా రూ.150, రూ.300, రూ. 500గా మూడు గ్రూపులుగా విభజించాలన్నారు.

గుండె పోటుతో యువకుడి మృతి

- వైద్యుల నిర్లక్ష్యమేనని కుటుంబ సభ్యుల ఆరోపణ

మృతుడు నందకిషోర్

బన్సీలాల్ పేట్, జూన్ 7: వైద్యులు సకాలంలో పట్టించుకోకపోవడం వల్ల యువకుడు మృతి చెందాడని అతని కుటుంబ సభ్యులు ఆరోపించారు. బన్సీలాల్ పేట్ డివిజన్ లోని చాచానెహ్రూ నగర్‌కు చెందిన జె.నందకిషోర్ ముదిరాజ్ (38) శుక్రవారం ఛాతిలో నొప్పి రావడంతో గాంధీ ఆస్పత్రికి వెళ్లి ఓపి చిట్టి తీసుకున్నాడు. కార్డియాలజీ వైద్యుడు అతనికి ఈసీజీ తీసుకొని రమ్మని చెప్పాడు. ఈసీజీ చేయించుకొని రిపోర్ట్ తీసుకొని తిరిగి డాక్టర్ వద్దకు వచ్చేసరికి క్యూలో చాలా మంది వేచి ఉన్నారు. అప్పటికే అక్కడికి వచ్చిన నందకిషోర్ తల్లి, భార్య, తమ్ముడు, అతడికి ఛాతి నొప్పి ఎక్కువ కావడం గమనించారు. డాక్టర్‌ను సంప్రదించేలోపే క్యూ లైన్‌లోనే నందకిషోర్ పడిపోయి ప్రాణాలు వదిలాడు. వెంటనే డాక్టర్ వచ్చి చూడగా అప్పటికే అతను మృతి చెందాడని చెప్పారు. తీవ్రమైన గుండె నొప్పితో వచ్చిన యువకుడిని ముందుగా పరిశీలించి వెంటనే అడ్మిట్ చేసుకొని చికిత్స అందించి ఉంటే, అతడు బతికేవాడని బోరున విలపించారు. వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యంగా ఉండడంవల్లే తమ కుమారుడు మృతి చెందాడని కన్నీటి పర్యంతం అయ్యారు. దీనికి గాంధీ దావాఖాన వైద్యులు బాధ్యత వహించాలని మృతుడి తల్లి పేర్కొన్నది. ఈ సంఘటనపై తాము గాంధీ దవాఖాన ఉన్నతాధికారులను కలిసి ఫిర్యాదు చేస్తామని, బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకుడు వై.శ్రీనివాస్ ముదిరాజ్ డిమాండ్ చేశారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

హిమాయత్‌నగర్, జూన్ 7: అసంఘటిత రంగంలో పనిచేసే కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కారం చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం. నరసింహ శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. అనేక పోరాటాలు చేసి సాధించుకున్న కార్మిక చట్టాలను అమలు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభు త్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు. ప్రభుత్వ రంగాలను నిర్వీర్యం చేస్తూ ప్రైవేట్ రంగాలను ప్రోత్సహిస్తూ కార్పొరేట్ శక్తులకు అండగా నిలుస్తున్నాయన్నారు. అవకాశాలు అంతంత మాత్రంగానే ఉన్నాయని అన్నారు.

ప్రభుత్వ పాఠశాలలకే పంపించాలి

బన్సీలాల్‌పేట్‌లో బడిబాట ర్యాలీ నిర్వహించిన ఉపాధ్యాయులు

బన్సీలాల్‌పేట్, జూన్ 7: చిన్నారులను ప్రభుత్వ పాఠశాల్లోనే చేర్పించాలని కోరుతూ బన్సీలాల్‌పేట్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆధ్వర్యంలో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కె.స్వప్నమాల మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్య అం దించేది ప్రభుత్వ పాఠశాలలలేనని అన్నారు. ఉచితంగా విద్య, పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్, మధ్యాహ్న భోజనం, డిజిటల్ తరగతులు, క్రీడలు అందిస్తున్నామని ఆమె అన్నా రు. అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేటు బడులకు కాకుండా తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు.

ఇచ్చిన హామీలను అమలు చేయాలి

చిక్కడపల్లి, జూన్ 7: కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఎడాదిన్నర కావస్తున్నా చేవెళ్ల డిక్లరేషన్ పేరుతో గిరిజనులకు ఇచ్చిన 16 రకాల హామీల్లో ఒక్కటి కూడా అమలు చేయకుండా కాలయాపన చేస్తూ గిరిజనులను మోసం చేస్తోందని వక్తలు పేర్కొన్నారు. హామీల అమలు కోసం రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. శనివారం బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎం.ధర్మానాయక్ అధ్యక్షతన సంఘం రాష్ట్ర విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.శ్రీరాంనాయక్, రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు, సహాయ కార్యదర్శులు భూక్యా వీరభద్రం, గూగులోత్ భీమా సాహెబ్, ఎం.బాలు నాయక్, చందునాయక్, అశ్విని, భూక్యా హరి, ఎర్రానాయక్, అమర్‌సింగ్, బాల్యా నాయక్, గోపి, రాంకుమార్, మహిపాల్ నాయక్, వెంకట్రామ్ నాయక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తక్షణం గిరిజన హామీలపై మంత్రివర్గ ఉప సంఘాన్ని ఏర్పాటు చేసి అమలకు కార్యాచరణ ప్రకటించాలన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే గిరిజన హామీలను అమలు చేస్తామని ఆనాడు పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా చేవెళ్ల డిక్లరేషన్ పేరుతో జరిగిన బహిరంగ సభలో ప్రకటించారని గుర్తుచేశారు. గిరిజనులకు ఇచ్చిన హామీలను ఎప్పుడు అమలు చేస్తారని, గిరిజన ప్రజలు ఆశతో ఎదురు చూస్తున్నారన్నారు. హామీల అమలు ఆలస్యం కావడం వల్ల గిరిజనులకు తీవ్ర నష్టం జరిగే ప్రమాదం ఉన్నదని ఆందోళన వ్యక్తం చేశారు. గిరిజన సంక్షేమ శాఖ రాజ్యాంగబద్ధ అధికారాలు కలిగిన 5వ షెడ్యూల్ ప్రాంతంతోపాటు గిరిజనులకు అనేక హక్కులు, చట్టాలు అమల్లో ఉన్నాయన్నారు. గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలను విన్నవించుకోవడానికి కూడా అవకాశం లేకుండా పోయింది. సీఎం వద్దే గిరిజన శాఖ ఉండటం వల్ల గిరిజన సమస్యలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉన్నాయన్నారు. ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.

ఆకట్టుకున్న నృత్యం

కొండాపూర్: వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా నృత్యకారుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. మాదాపూర్‌లోని శిల్పారామంలో శనివారం నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలో భరతనాట్యం, కూచిపూడి ప్రదర్శనలు అలరించాయి. చెన్నై నుంచి విచ్చేసిన భరతనాట్య కళాకారిణి రాజేశ్వరి, శ్రీముఖి నృత్యాలయ నాట్యగురువు మనస్విని కోసూరు శిష్యబృందం కూచిపూడి అంశాలను మనస్విని, అంజన, రుక్మిణి, హిమశ్రీ, శ్రీలేఖ, భువన, సహస్ర, హరిణి, దివ్యశ్రీ, ఆరాధ్య, శ్రీనిక, రుత్విక, అన్విక, విజయశ్రీ, పూర్వీక, మాన్విత, హరిహర ప్రదర్శించారు.

బహుజన్ రాజ్యాధికారం పార్టీ ఆవిర్భావ సభ

చిక్కడపల్లి, జూన్7: బహుజన్ రాజ్యాధికారం పార్టీ ఆవిర్భావసభ శనివారం సాయంత్రం బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగింది. పార్టీ రాష్ట్ర కన్వీనర్ జన్ను సాంబయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా బీసీ ఆజాది జేఏసీ చైర్మన్ బత్తుల సిద్ధేశ్వర పటేల్, ఆర్టీసీ జేఏసీ కోకన్వీనర్ సుద్దాల సురేష్ అంబేద్కర్ ఆజాది సంఘం అధ్యక్షుడు కొంగర నరహరి హాజరై బహుజన్ రాజ్యాధికారం పార్టీ జెండా, కండువాను ఆవిష్కరించారు. పార్టీ రాష్ట్ర కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడిగా జన్ను సాంబయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షులుగా ఎడ్ల రవిముదిరాజ్, పీసరి రజిత, వ్యవస్థాపక రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా, అధికారిక ప్రతినిధులుగా బుర్రి సాగర్ తదితరులను ఎన్నుకున్నారు.

పర్యావరణ పరిరక్షణను ప్రోత్సహించే దిశగా..

మాదాపూర్, జూన్ 7: ఆరోగ్య సంరక్షణ రంగంలో స్థిరమైన సంరక్షణ పద్ధతులు, పర్యావరణ బాధ్యతను ప్రోత్సహించే లక్ష్యం తో ముందుకు సాగుతున్నట్లు పబ్లిక్ హెల్త్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా వ్యవస్థాపక అధ్యక్షుడు పద్మభూషణ్, ఢిల్లీ ఎయిమ్స్ కార్డియాలజీ మాజీహెడ్, డాక్టర్ శ్రీనాథ్‌రెడ్డి అన్నారు. మాదాపూర్‌లోని హైటెక్‌సిటీలో యశోద దవాఖానల యాజమాన్యం సహకారంతో పర్యావరణ దినోత్సవాన్ని శనివారం నిర్వహించారు. డాక్టర్ శ్రీనాథ్‌రెడ్డి మాట్లాడుతూ.. మానవ ఆరోగ్యాన్ని సమర్థిస్తూ పర్యావరణ పరిరక్షణను ప్రోత్సహించడంలో యశోద దవాఖాన యాజమాన్యం ముందుంటుందన్నారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు, డాక్టర్ దిలీప్ బానుశాలి ఆసుపత్రి పరిశ్రమ (వైద్య రంగం) ద్వారా పర్యావరణ రక్షణ యొక్క అవసరం ఆవశ్యకతను వివరించారు. యశోద ఆసుపత్రి లీడ్ హాస్పిటల్ సౌత్‌జోన్ రెండు వద్ద మెడికల్ సర్వీసెస్ డాక్టర్ లింగయ్య పర్యావరణ కార్యక్రమాలు, సహాయం, వ్యవస్థల అత్యవసర అవసరాన్ని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా దవాఖానలు, నర్సింగ్ హోమ్స్ నుంచి ఆహ్వానితులు, హరిత కార్యక్రమాలను అభ్యసిస్తున్న దవాఖానలకు అవార్డులు అందజేశారు. కార్యక్రమంలో పర్యావరణ సహాయక సేవలు ఉత్పత్తులు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో నిపుణుల చర్చలు, భాగస్వామ్య సెషన్లు, గ్రీన్‌హెల్త్ కోసం తీసుకోవలసిన చర్యలపై చర్చించారు.